డ్రైనేజీలు అస్తవ్యస్తం

- శిథిలమై, ఆకృతి కోల్పోయిన మురుగుకాల్వలు
- కొన్ని ప్రాంతాల్లో నాచు పట్టి, చెరువుల్లా ఉన్న వైనం
- మరికొన్ని చోట్ల పేరుకుపోయిన మట్టి
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న మురుగు
- దుర్గంధం, వ్యాధులతో గ్రామస్తులు సతమతం

వర్షాకాలం మరింత నరకం

వర్షాకాలం అయితే డ్రైనేజీల నుంచి పొంగిన నీరు ఇళ్లలోకి ప్రవేశించి తద్వారా కప్పలు, విషపురుగులు ప్రవేశించడం సర్వసాధారణం అయిపోయింది. అంతేకాకుండా డ్రైనేజీలు ప్రవహించడానికి పలుచోట్ల అడ్డంకులు ఏర్పడటంతో, ఏడాది పొడవునా నిలిచిన మురుగునీటి కారణంగా సమీపంలో ఉన్న బోరుబావులు కలుషితం అవుతున్నాయి. చిల్లపేట పెద్ద చెరువుకు అనుసంధానంగా ఉన్న మదుముల పూడిక తొలగించి డ్రైనేజీల ద్వారా నీరు సాఫీగా సాగడానికి జీవీఎంసీ ఏర్పాటు చేయాలని ఈ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జీరుపేట నుంచి చిల్లపేట వరకు భీమిలి రోడ్డును ఆనుకుని కాంక్రీట్ డ్రైనేజీ నిర్మించి ఈ రెండు గ్రామాల లోపల శిథిలమైన డ్రైనేజీలకు కూడా మరమ్మతులు నిర్వహించి దీనికి అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


చిల్లపేట-జీరుపేట మధ్య మట్టితో నిండిన డ్రైనేజీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు చిల్లపేట, జీరుపేట గ్రామాల మధ్య డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. కొత్తవారు ఎవరైనా ఏమరుపాటుగా చూస్తే చెరువులే డ్రైనేజీల్లా ఉన్నాయి అనుకుంటారు. పూర్తిగా శిథిలమై ఆకారం కోల్పోయి, నాచుపట్టి, పాలిథిన్ వ్యర్థాలతో నిండి, ఇరువైపులా తుప్పలతో, మట్టితో పూడుకుపోయి ఏళ్ల తరబడి ఇలాగే మురుగుతున్నాయి. పోనీ ఇదేమైనా మారుమూల మురికివాడ అనుకుంటే పొరపాటే. భీమిలి నియోజకవర్గ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ మార్గం ద్వారానే భీమిలి ఎమ్మెల్యే, ఆర్డీవో, తహసీల్దార్, జెడ్పీ తదితరులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చిల్లపేట, జీరుపేట గ్రామాలు కూడా జీవీఎంసీలోనే ఉన్నాయనే విషయం అధికారులు, సిబ్బందికి తెలుసా అనే సందేహమూ గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది.


భీమిలి రోడ్డును ఆనుకుని జీరుపేట వద్ద డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

దశాబ్దాల నాటి నిర్మాణాలు

ఎప్పుడో దశాబ్దాల కాలం క్రితం పంచాయతీలో ఉన్నప్పుడు ఇటుకలతో నిర్మించిన డ్రైనేజీలే తప్ప ఆ తరువాత కాలంలో భీమిలి మున్సిపాల్టీలో, జీవీఎంసీలో విలీనమైనా వీటికి మోక్షం కలగలేదు. ఈ డ్రైనేజీలను ఆనుకుని నివసిస్తున్నవారు నిత్యం పాములు, దోమలు, ఈగలు, పందులు, బ్యాక్టీరియాతో సహవాసం చేస్తూ వ్యాధుల బారిన పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది కూడా ఈ డ్రైనేజీలను శుభ్రం చేయలేని విధంగా సుమారు అర కిలోమీటరు వరకు భీమిలి రహదారిని ఆనుకుని అత్యంత దయనీయంగా ఉన్నాయి.


జీరుపేట ముఖద్వారం వద్ద మదుముల వరకు పూడుకుపోయిన డ్రైనేజీ


భీమిలి రోడ్డును ఆనుకుని చెరువును తలపిస్తున్న డ్రైనేజీ


డ్రైనేజీకి ఇరువైపులా తుప్పలు


శిథిలమైన డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టి

ఇళ్ల ముందు సర్కస్ ఫీట్లు

జీరుపేట నుంచి చిల్లపేట వరకు ఇళ్ల ముందే దారుణంగా దుర్గంధపూరితంగా డ్రైనేజీలు ఉండటం ఒక ఎత్తయితే, వాటిని దాటడానికి స్థానికులు పాత విద్యుత్ స్తంభాలు తెచ్చుకుని వాటిపై నుంచి సర్కస్ ఫీట్లు చేస్తుంటారు. అంతేకాకుండా ఇంటి ముందు డ్రైనేజీలకు ఇరువైపులా పెరిగిన తుప్పలలో సంచరించే విషపురుగులు తరచూ కాళ్ల కింద సంచరిస్తుంటాయి. ఇటీవల జీరుపేటలోకి ఒకరి ఇంట్లోకి ప్రవేశించిన విషపురుగు ఆ ఇంట్లో మహిళ ప్రాణాలను బలి తీసుకుంది.

కనీసం శుభ్రం చేసినా చాలు



డ్రైనేజీలకు మరమ్మతులు చేయకపోయినా కనీసం శుభ్రం చేసినా బాగుండేది. మనుష్యులతో వీటిని శుభ్రం చేయడం సాధ్యం కాదు. యంత్రాలను ఉపయోగించి ముందుగా పూడిక తొలగించాలి. – కె.మోహనరెడ్డి, స్థానికుడు

వ్యాధులు ప్రబలకుండా చూడాలి



డ్రైనేజీలలో నిలిచిన మురుగు నీటి వల్ల ఎలాంటి వ్యాధులు తలెత్తకుండా జీవీఎంసీ తరచూ రసాయనాలు పిచికారీ చేయాలి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించి, జాగ్రత్తలు తీసుకోవాలి. –కాసా శేఖర్, స్థానికుడు

విష పురుగుల దాడి



వర్షం కారణంగా తరచూ భీమిలి రోడ్డు, డ్రైనేజీలకు ఇరువైపులా మొక్కలు పెరిగి విషపురుగులు దాడులు చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, రన్నింగ్ చేసేవారికి ఇబ్బంది కలుగుతోంది. –జి.తరుణ్, స్థానికుడు


ప్రవాహం లేక నిలిచిన మురుగు

క్లుప్తంగా

క్షతగాత్రుడి చికిత్సకు ఆర్థిక సాయం


సాయి కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం: ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ బుధవారం ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ఆటో ప్రమాదంలో బోరపేటకు చెందిన నిరుపేద వ్యక్తి బర్ల సాయి అనే వ్యక్తికి రెండు కాళ్లు విరిగిపోయాయి. సాయి చికిత్స కోసం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు.

యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు


వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రోగులు

మధురవాడ: స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ముఖ్యంగా గర్భిణులకు, ఇతర మహిళలకు రక్త పరీక్షలతో పాటు టీబీ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మోహన్ కృష్ణ, టీబీ సూపర్ వైజర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

254 మందికి వైద్య పరీక్షలు

తగరపువలస: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక యూపీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 254 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని 2వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని చిన్ని కుమారి లక్ష్మి ప్రారంభించారు. వైద్యులు ఝాన్సీ లక్ష్మి, రవీంద్ర నాయక్, హైమవతి, మౌనిక, భవాని, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్పెంటర్ల వితరణ


పేదలకు భోజనాలు, తువ్వాళ్లు పంపిణీ చేస్తున్న కార్పెంటర్లు

తగరపువలస: విశ్వకర్మ జయంతి సందర్భంగా స్థానిక కార్పెంటర్లు వంద మంది పేదలకు బుధవారం తువ్వాళ్లు, భోజనాలు పంపిణీ చేశారు. ఆలయాలు, మార్కెట్, రహదారి వెంట అభాగ్యులకు లంకలపల్లి శంకరరావు, వెంకటరావు వీటిని అందజేశారు. పలుచోట్ల విశ్వకర్మ పూజలు, అన్నదానాలు, నిమజ్జనాలు నిర్వహించారు.

కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్ల పంపిణీ


దివ్యాంగులకు వీల్‌చైర్లు అందించిన ట్రస్ట్ సభ్యులు

పద్మనాభం: గోస్తని ఉన్నత పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు బుధవారం కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా పద్మనాభం వద్ద బీజేపీ వైద్య విభాగం, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, శ్రీగాయత్రి వెల్ఫేర్ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత ముఖ్య అతిథిగా పాల్గొని, వీటిని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్, పార్టీ మండల ఇన్‌చార్జి రూపాకుల రవికుమార్, పార్టీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి, నాయకులు పాల్గొన్నారు.

జీరుపేటలో హైఓల్టేజీ సమస్య పరిష్కారం

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు జీరుపేటలో హై ఓల్టేజీ కారణంగా మంగళవారం తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించామని చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ బొట్టా రవి తెలిపారు. సాంకేతిక కారణాల వలన మాత్రమే ఇక్కడ నష్టం జరిగిందన్నారు. సిబ్బందిని వెంటనే పంపించి, పనులను పర్యవేక్షించామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


మాట్లాడుతున్న ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజర్వ్ బ్యాంకు రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్ మాట్లాడుతూ, గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమాల గురించి తెలియజేశారు. జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఈకేవైసీ, నామిని, సైబర్ క్రైమ్‌ల గురించి తెలియజేశారు. జన్‌ధన్ ఖాతాల నవీకరణ, గ్రామ స్థాయిలో బ్యాంకుల సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ చిరంజీవి వెంకటేష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, గ్రామ పెద్ద కంబపు శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై అభ్యంతరం


నగరంపాలెం రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ పనులపై, ఆస్తులు పోతున్న వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి-నగరంపాలెం రోడ్డు కార్నర్‌లో ఉన్న దుకాణాలు, దానిని ఆనుకుని ఉన్న స్థలానికి టీడీఆర్ ఇవ్వకుండానే అధికారులు దుకాణాలు ఖాళీ చేయమనడమే కాకుండా, స్థలం స్వాధీనం చేసుకుంటామని బెదిరిస్తున్నారని వారు అంటున్నారు. గతంలో కూడా ఈ రోడ్డుతో పాటు రేవళ్లపాలెం రోడ్డులోనూ స్థలాలు, దుకాణాలు పడగొట్టి టీడీఆర్ ఇవ్వలేదని తెలిపారు. ముందు స్వాధీనం చేసుకున్న స్థలాలకే అధికారులు టీడీఆర్‌లు ఇవ్వలేదని, తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల పాతబకాయిలు చెల్లించాలి

తగరపువలస: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) జిల్లా అధ్యక్షుడు బమ్మిడి కేశవరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ఆనందపురంలో మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మెరుగైన పీఆర్సీతో పాటు పాత బకాయిలు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగుల న్యాయబద్ధమైన హక్కులను వాయిదా వేయడం తగదన్నారు. వెంటనే వారికి రావలసిన బకాయిలన్నీ విడుదల చేయాలని జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయుల తరపున కేశవరావు కోరారు.

కూలేందుకు సిద్ధంగా..


కొండపేటలో ఇంటిపైకి వాలిపోయిన స్తంభం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేట కొండవాలు ప్రాంతంలో 37ఎ9/1 నంబరు కలిగిన విద్యుత్ స్తంభం ఏ క్షణమైనా కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఒక ఇంటిపై వాలి ప్రమాదకరంగా ఉండటంతో అక్కడి వారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. అసలే వర్షాకాలం కావడంతో గాలివానలకు ఇంటిపై కూలితే పెను ప్రమాదమే జరుగుతుందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు జోక్యం చేసుకుని స్తంభాన్ని మార్చాలని కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా రాట మహోత్సవం


రాట మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


లొడగలవానిపాలెంలో రాట వేస్తున్న స్థానికులు

కొమ్మాది: దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని 8వ వార్డు గుడ్లవానిపాలెంలో జీవీపీ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాట మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

లొడగలవానిపాలెంలో..

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం రాట వేశారు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల్లో చేపట్టనున్న కార్యక్రమాల గురించి చర్చించారు. రాట ఉత్సవంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

అండర్-14 బాలబాలికలకు రేపు బేస్‌బాల్ ఎంపిక పోటీలు

తగరపువలస: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలలో భాగంగా భీమిలి వుడా మినీ స్టేడియంలో శుక్రవారం అండర్-14 బాలబాలికలకు బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు కేథరిన్ విద్యాసంస్థల అధినేత ఆలీవర్ ఆర్ రాయి తెలిపారు. కేథరిన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస విద్యుత్ సబ్‌స్టేషన్ రూరల్ ఫీడర్‌పై నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విశాఖ ఆపరేషన్ జోన్-3 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా తాళ్లవలస, రాయినపేట, ఎరుసుపేట, లెజెండ్ లే అవుట్, వనుముపేట, మహిత లే అవుట్, హాసిని లే అవుట్, హార్మోన్ లే అవుట్ తదితర పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వీధి లైట్లు పునరుద్ధరించారు

సాక్షి ఎఫెక్ట్..

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి నుంచి పాత పీఎం పాలేనికి వెళ్లే రోడ్డులో వీధి దీపాలను పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వీధి లైట్లు కొద్ది రోజులుగా సక్రమంగా వెలగడం లేదు. ఈ నేపథ్యంలో 'కారు షెడ్ కూడలిలో అంధకారం' శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురించిన వార్తకు వీధి దీపాల నిర్వహణ అధికారులు వెంటనే స్పందించారు. బుధవారం రోడ్డు పొడవునా వీధి దీపాలు పునరుద్ధరించడంతో, ఆ ప్రాంతమంతా విద్యుత్ కాంతులతో నిండిపోయింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే పిలకవానిపాలెం, వుడా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కారుషెడ్ కూడలి నుంచి పాత పీఎం పాలెం వెళ్లే రోడ్డులో పునరుద్ధరించిన వీధి లైటు

సింహాచలేశుడికి ఘనంగా ఏకాదశి తిరువీధి


అప్పన్నకు ఏకాదశి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఘనంగా తిరువీధి నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో వేంజేపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో ఊరేగించారు. విశేషంగా హారతులు సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఆకుముడత నివారణకు క్లోరిపైరిఫాస్


అనంతవరంలో ఆకుముడత గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి చలం

పద్మనాభం: వరిలో ఆకుముడత నివారణకు లీటర్ నీటిలో 2 మి.లీ. క్లోరిపైరిఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి చలం తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంధవరం, అనంతవరం పంచాయతీలలో బుధవారం ఆయన పర్యటించారు. పొడ తెగులు నివారణకు 2 ఎంఎల్ హెక్సాకొనజోల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతవరంలో డ్రోన్ సహాయంతో 20 ఎకరాల వరిపైరుపై పురుగుల మందు పిచికారీ చేశారు. డ్రోన్‌తో పిచికారీ చేయడానికి ఎకరానికి రూ.450 ఖర్చు అవుతుందన్నారు. ఈ డ్రోన్ రెడ్డిపల్లిలో శ్రీనివాసరావు అనే రైతు వద్ద ఉందని, అవసరమైన వారు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ కూడా డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీతో ఇచ్చిందన్నారు.

మద్దిలో వ్యవసాయ క్షేత్రం పరిశీలన


క్షేత్ర పరిశీలనలో పాల్గొన్న అధికారులు

పద్మనాభం: రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మద్ది గ్రామంలో బుధవారం వ్యవసాయ క్షేత్ర పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను సంస్థ సీనియర్ కన్సల్టెంట్ రాయుడు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. 365 రోజుల సాగు విధానం, తద్వారా దిగుబడులు ఏ విధంగా సాధించవచ్చని తెలిపారు. ఇక్కడ ఎటువంటి వంటలు వేశారు, వాటి వల్ల ప్రయోజనాలు, దిగుబడుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రీజనల్ అధికారి ప్రకాశ్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సాగరతీరంలో అరుణోదయం కనువిందు చేసింది. భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వద్ద బుధవారం వేకువజామున లేలేత సూర్యకిరణాలు కడలిని తాకుతున్న వేళ కనిపించిన రమణీయ దృశ్యం సందర్శకుల మది దోచింది. అలల ఒడిలో పడవపై ప్రయాణం మరపురాని అనుభూతిని అందించింది. ఆహ్లాదకర వాతావరణం తీరంలో వాకర్లను ఆకట్టుకుంది. ప్రకృతి గీసిన ఈ అందమైన చిత్రాన్ని సందర్శకులు తమ కెమెరాలలో, మొబైల్ ఫోన్లలో బంధించారు.

– కొమ్మాది

ఏయూలో మైక్రో ఆర్గానిజం డే

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్నేషనల్ మైక్రో ఆర్గానిజం డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ మానవాళికి మేలు చేసే, కీడు చేసే రెండు విధాల సూక్ష్మజీవులు ఉంటాయన్నారు. ఇటీవల కేరళలో వెలుగు చూసిన ఒక బ్యాక్టీరియా మనుషుల మెదడుపై ప్రభావం చూపిందని గుర్తు చేశారు. ఇటువంటి అంశాలు ఒక నూతన సవాల్‌గా నిలుస్తాయని, వీటిపై పరిశోధనలు చేయాలని సూచించారు. తరగతి గదిలో పుస్తకాల నుంచి పొందిన జ్ఞానానికి ప్రయోగశాలలో ప్రత్యక్షంగా నేర్చుకునే విధానానికి ఎంతో వ్యత్యాసం ఉంటుందని చెప్పారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ మానవ ఆరోగ్యం బయోలాజికల్, సైకలాజికల్ అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు. విభాగాధిపతి ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు వర్తమాన అంశంపై అవగాహన కల్పించేలా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శాస్త్రవేత డాక్టర్ అహ్మద్ బాష, డాక్టర్ ధనశేఖర్ ప్రసంగించారు.

మైక్రోస్కోప్‌లో వివిధ సూక్ష్మజీవులను వీక్షించే అవకాశం విద్యార్థులకు కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డాక్టర్ పి.లక్ష్మి, డాక్టర్ పి.రాజా రమేష్ కుమార్, ఆచార్య పద్దయ్య, ఆచార్య వి.లక్ష్మి, ఆచార్య పి.రాధిక తదితరులు ప్రసంగించారు.